క్లుప్తంగా

వెల్లాలలో పూజలు

రాజుపాళెం : శ్రావణ మాసంలో నాల్గవ శనివారం కావడంతో మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను పల్లకిలో ఆశీనులు చేసి వైభవంగా ఊరేగించారు. భక్తులు స్వాములకు పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. సంజీవరాయ అన్నదాన సత్రంలో కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గౌరవ డాక్టరేట్ ప్రదానం


గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న పిరమిడ్ మాస్టర్ సుబ్బారావు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన పిరమిడ్ మాస్టర్ సి.సుబ్బారావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు ఈయన చేసిన ఆధ్యాత్మిక, సామాజిక సేవలకుగాను శనివారం గౌరవ డాక్టరేట్‌ను అందించారు. ఈయనకు గౌరవ డాక్టరేట్ రావడం పట్ల దొరసానిపల్లె సత్యదేవ పిరమిడ్ ధ్యానకేంద్రం పిరమిడ్ మాస్టర్లు, ఆర్య వైశ్య సంఘం ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలు అభినందనలు తెలిపారు.

కంటి జబ్బులను అశ్రద్ధ చేయవద్దు

ప్రొద్దుటూరు క్రైం : కంటి జబ్బులను అశ్రద్ధ చేయకుండా సమస్య వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని అప్తాల్మిక్ అధికారి కేజే రఘురామిరెడ్డి తెలిపారు. స్కూల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా పట్టణంలోని రమణమహర్షి, ఎస్‌కేవీ హైస్కూళ్లలోని విద్యార్థులకు శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. రెండు పాఠశాలల్లో 546 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా 38 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందించనున్నట్లు కేజే రఘురామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, ఏఎన్‌ఎంలు వరలక్ష్మి, జయలక్ష్మి, వెంకటలక్ష్మి, ఆశా వర్కర్ శైలజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


అల్లాడుపల్లెలో హెచ్ఐవీపై అవగాహన సదస్సు

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో శనివారం చైల్డ్ ఫండ్ ఇండియా స్కీం ఆధ్వర్యంలో ఎయిడ్స్/హెచ్ఐవీ నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు అవగాహన కలిగేలా గ్రామంలో ర్యాలీ ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్‌హెచ్‌పీ రాజరాజేశ్వరి మాట్లాడుతూ.. హెచ్ఐవీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, లైంగిక సంబంధాల వలన ఎయిడ్స్ భారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఏఎన్ఎం విజయకుమారి, చైల్డ్ ఫండ్ ఇండియా సిబ్బంది మహబూబ్ బాషా, దర్బార్, సురేంద్ర, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆందోళనలు

బద్వేలు అర్బన్ : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలని కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త ఆందోళనలను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పి.బాలు తెలిపారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవీ భవన్‌లో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకు నిత్యావసర సరుకులతో పాటు బియ్యం, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధిక ధరల తగ్గింపు హామీ కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితమైందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం నాసిరకం బియ్యం పంపిణీతో సరిపెడుతున్నారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పి.వెంకటరమణ, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొద్దిపాటి వర్షానికే గుంతలమయం


ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఏర్పడ్డ గుంత

పోరుమామిళ్ల : పట్టణంలో శనివారం తెల్లవారుజామునుంచి పడుతున్న జల్లులకే ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రెండు సంవత్సరాల క్రితం మొదలు పెట్టిన డివైడర్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పనులు ఆగిపోయిన చోట రోడ్డు గుంతలు పడింది. ఆర్టీసీ బస్టాండు, అంబేడ్కర్ సర్కిల్, సాయిబాబా దేవాలయం దగ్గర రోడ్డు పనులు ఆగాయి. గుంతల్లో నీళ్లు నిలబడటంతో వాహనాలు ఆ గుంతల్లో దిగబడి పోతున్నాయి. గుంతలు పూడ్చి ఇబ్బంది లేకుండా చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రాజోలి ఆనకట్టకు జలకళ

రాజుపాళెం : కర్నూలు, నంద్యాల జిల్లాలలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు మండల పరిధిలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. శుక్రవారం రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 11,200 క్యూసెక్కులు నీరు పోతుండగా శనివారం 14,100 క్యూసెక్కులు, కేసీ ప్రధాన కాలువకు 500, కేసీ చాపాడు కాలువకు 110 క్యూసెక్కుల నీరు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం రాజోలి ఆనకట్ట వద్ద జళకళ సంతరించుకుంది. వెల్లాల గ్రామ సమీపంలోని పాత వంతెనను తాకుతూ వర్షం నీరు పోతోంది.

మడువంకపై వర్షం నీరు

పైతట్టు ప్రాంతాలైన పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల్లో కురిసిన వర్షం నీటితో పాటు రాజుపాళెం మండలంలో శుక్రవారం కురిసిన వర్షం నీరు రాజుపాళెం-వెంగలాయపల్లె గ్రామాల మధ్యలో ఉన్న మడువంక వద్ద ఉన్న లోలెవెల్ కాజ్‌వేపై అడుగు మేర ప్రవహిస్తోంది. అయితే వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలుగలేదు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పత్తి, పసుపు, వరి, మిరప పంటలకు ఈ వర్షం ఎంతో ఊరట నిచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 36.8 మిల్లీ మీటర్ల వర్షంపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.


రాజుపాళెం- వెంగలాయపల్లె రహదారి మధ్యలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు


రాజుపాళెం: రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న వర్షం నీరు


రాజుపాళెం: వెల్లాల పాత వంతెనపైన పోతున్న వర్షం నీరు

పంట పొలాలు మునక

ప్రొద్దుటూరు : చాలా రోజుల తర్వాత ప్రొద్దుటూరులో అత్యధిక వర్షపాతం నమోదైంది. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. 93 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం ప్రభావం కారణంగా పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని ప్రధాన కాలువలు నిండి రోడ్లపైకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో పంట పొలాల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచి ముంపునకు గురయ్యాయి. కేసీ కెనాల్‌కు ఇటీవల నీరు విడుదల చేయడంతో ఎంతో ఆశతో రైతులు వరి నారు వేశారు. ఈ వర్షం కారణంగా సాగు చేసిన వరినారు ముంపునకు గురైంది. కొన్ని ప్రాంతాల్లో వరి నారు ముంపునకు గురికాగా, మరికొన్ని ప్రాంతాల్లో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. అక్కడక్కడ సాగులో ఉన్న పంటలు నీట మునిగాయి.


వర్షం నీటితో దెబ్బతిన్న వరినారు


అమృతానగర్ వద్ద పొలంలో వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తున్న దృశ్యం

చాపాడు మండలంలో భారీ వర్షం

చాపాడు : మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం ఎడతెరిపి లేకుండా తుపాన్ ప్రభావంతో వర్షం పడుతూనే ఉంది. మండలంలో 75.02 మి.మీ వర్ష పాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని చాపాడు సమీపంలోని గుండ్లకమ్మ వంక, గుంతచీపాడుకు వెళ్లే దారిలోని మల్లవంక పొంగి ప్రవహిస్తోంది. వంకపై వరద నీరు పారటంతో వంకపై రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షం కురవటంతో వరి సాగు చేసుకునే రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు.


చాపాడు సమీపంలోని గుండ్లవంకపై పారుతున్న వరద నీరు

సంచార జాతుల అభివృద్ధికి కృషి చేయాలి


సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : సంచార జాతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బి.సి.రమణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తిలు తెలిపారు. సంచార జాతుల విముక్తి దినోత్సవం సందర్భంగా శనివారం వారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సంచార జాతులపై అనేక అధ్యయనాలు, కమిషన్లు వేసి సానుకూల నివేదికలు వచ్చినప్పటికీ వారికి న్యాయం జరగలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అవుతున్నా నేటికీ సంచార జాతులు భిక్షాటన చేసి జీవించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంచార జాతుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ జాతీయ నాయకులు జి.వి.నరసింహులు, ఆవాజ్ పట్టణ అధ్యక్షులు సత్తార్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• కల్యాణం కమనీయం


శ్రీకొండగోపాలస్వామి మూలవిరాట్‌కు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అట్లూరు : శ్రీ కొండగోపాలస్వామి ఆలయంలో శ్రీవేణుగోపాలస్వామి, శ్రీరుక్మిణి, సత్యభామ సమేత కల్యాణం శనివారం కమనీయంగా జరిగింది. ప్రతి ఏటా శ్రావణమాసం చివరి శనివారం శ్రీకొండ గోపాలస్వామి ఆలయంలో కల్యాణం ఆనవాయితీ. అందులో భాగంగా శనివారం కొండూరు గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలోని శ్రీవేణుగోపాలస్వామి, రుక్మిణీ, సత్యభామ ఉత్సవ విగ్రహాలు శనివారం ఉదయం భాజా భజంత్రీయుల మధ్య తీసుకెళ్లి కొండగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో వేదపండితులు వైభవోపేతంగా కల్యాణం నిర్వహించారు.

జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోసం అన్నధాన కార్యక్రమం నిర్వహించారు.


ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంతో మెరుగైన వైద్యం

ప్రొద్దుటూరు క్రైం : ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని డాక్టర్ హనీఫ్ బాబా తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం కాకిరేనిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు అన్ని రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తుల ఇళ్ల వద్దకే వెళ్లి చికిత్స చేస్తామని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం వల్ల అతిసార వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీఏవరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ గౌతమి, ఏఎన్ఎం వేదవతి, డీఈఓ దేవరాజ్, పైలెట్ రామనాథ్, ఆశా వర్కర్లు వెంకటసుబ్బమ్మ, పద్మావతి, సంజమ్మ పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హనీఫ్‌బాబా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఖాజీపేట : మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్ హుసేన్ తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకొని శనివారం మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సర్వర్ ఖాన్ పేటలోని మున్వర్ హుసేన్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం మాజీ సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరులు అరెస్టు

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామానికి ఉత్తరం వైపు ఉన్న చీనీ చెట్ల వద్ద జూదమాడుతున్న ముగ్గురు జూదరులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.31,820 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రొద్దుటూరులో 30 పోలీస్‌యాక్ట్

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు సబ్‌డివిజన్‌లో సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని డీఎస్పీ ఎం. భక్తవత్సలం ఒక ప్రకటనలో తెలిపారు. ఊరేగింపులు, ధర్నాలు, సభలను నిర్వహించేందుకు పోలీసుల ముందస్తు అనుమతి తప్పకుండా తీసుకోవాలన్నారు. 30 పోలీసు యాక్టు నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

విలువైన స్థలం కబ్జాకు యత్నం


సర్వేనెంబరు 943/3లో ఆక్రమణకు గురైన స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు


అట్లూరు : ఆక్రమణదారులు జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

అట్లూరు : ప్రజా అవసరాల నిమిత్తం కేటాయించిన విలువైన స్థలం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆక్రమణలకు గురవుతుంది.

మండల కేంద్రమైన అట్లూరు రెవెన్యూ పొలంలోని సర్వేనెంబరు 943/3లో 41 సెంట్ల స్థలం, సర్వేనెంబరు 944/3లో ఒక ఎకరా 30 సెంట్ల స్థలంలో గత టీడీపీ అధికారంలో పార్కుకు కోసం 70 సెంట్లు కేటాయించడంతో పాటు మిగిలినది ప్రజా అవసరాల నిమిత్తం కేటాయించారు. అయితే ఈస్థలం మండల కేంద్రం ప్రధాన రహదారి అనుకుని ఉండటంతో రూ.కోట్ల విలువ చేస్తుంది. గత ఏడాది కొంతమంది ఈస్థలంపై కన్నేసి కబ్జా యత్నం చేశారు. అయితే అప్పట్లో టీడీపీ నాయకులు ఈస్థలం కబ్జాకు కాకుండా అడ్డుకున్నారు. అప్పటి తహసీల్దారు శ్రీవాణి రెండు సర్వేనెంబర్లలోని స్థలంలో ఎవరైన క్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆక్రమణదారులు శనివారం సుమారు పది సెంట్ల మేర గునాది తీసేందుకు యత్నించారు.

ఆక్రమణలకు దిగితే చర్యలు

943/3, 944/3 లోని ప్రభుత్వ స్థలం ఆక్రమణ విషయమై ఇన్‌చార్జి తహసీల్దారు రవిశంకర్‌ను వివరణ కోరగా గ్రామస్తులు కూడా ఫిర్యాదు చేశారని గునాది తీస్తుంటే నిలిపి వేశామన్నారు. ఆక్రమనలకు దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రామలింగేశ్వర్



ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా పీవీ రామలింగేశ్వర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు కార్పొరేషన్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఈయనను ప్రొద్దుటూరు మున్సిపాల్ కమిషనర్‌గా నియమించారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో ఈయనను ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. ప్రొద్దుటూరులో కమిషనర్‌గా పనిచేస్తున్న జి.రఘునాథరెడ్డిని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం..

బి.కోడూరు : మండలంలోని సిద్దుగారిపల్లె గ్రామానికి చెందిన ఎస్సీకాలనీలో 11 కె.వి. విద్యుత్ వైర్లు కాలనీ మధ్యలో వెళుతుండటంతో వర్షం వచ్చిన సమయంలో కాలనీ వాసులు బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. మిద్దెపైన చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు ఉండటంతో చిన్న పిల్లలు ఆడుకుంటూ వైర్లను తాకితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో విద్యుత్ అధికారులు కాలనీని సందర్శించినప్పటికీ ఫలితం లేదన్నారు. అధికారులు చొరవచూపి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


సిద్దుగారిపల్లె ఎస్సీకాలనీలో ఇళ్లపైన చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు

వృత్తికే వన్నె తెచ్చారు

బద్వేలు అర్బన్ : ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా డాక్టర్ సి.రాంప్రసాద్ అంకితభావంతో సేవలందించి వృత్తికే వన్నె తెచ్చారని మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచపూడి వెంకటసాయికృష్ణ తెలిపారు. శనివారం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 5 సంవత్సరాలుగా బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు 30 పడకల ప్రభుత్వాసుపత్రిని 50 పడకల ప్రభుత్వాసుపత్రిగా చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం డాక్టర్ రాంప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్ఐ రవికుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీవాణి పాల్గొన్నారు.


డాక్టర్ రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణ

రాజారెడ్డి సేవలు అభినందనీయం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆయుర్వేద ఫార్మసిస్ట్ పాలగిరి రాజారెడ్డి సేవలు అభినందనీయమని ఆయుర్వేద వైద్యురాలు అపర్ణ శ్రీరామ్ తెలిపారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలోని ఆయుర్వేద వైద్యశాలలో శనివారం రాజారెడ్డి పదవీవిరమణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి, అనితకుమారి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనాని వైద్యుడు నిరంజన్, జమ్మలమడుగు మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, రిటైర్డు మెడికల్ ఆఫీసర్ పాండురంగారెడ్డి, డాక్టర్ సృజన, హోమియో ఫార్మసిస్టు మహేశ్వరయ్య, కపిల్ తదితరులు పాల్గొన్నారు


రాజారెడ్డి, అనితకుమారి దంపతులతో వైద్యులు, సిబ్బంది

మురికి నీరు నిలవడానికి ప్రజలే కారకులు

- కాలువలు, రోడ్లను ఆక్రమించుకున్నారు
- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆగ్రహం

ప్రొద్దుటూరు క్రైం : డ్రైనేజి కాలువల్లో నీరు పారకపోవడానికి ప్రొద్దుటూరు ప్రజలే కారకులని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. ప్రొద్దుటూరు ప్రజలు కాలువలను, రోడ్లను ఆక్రమించుకోవడం వల్లనే కాలువల్లో నీరు పోవడం లేదన్నారు. టీడీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. కాలువల్లో పూడిక తీయలేని పరిస్థితిల్లో ఆక్రమణలు జరిగాయన్నారు. మడూరు కాలువ, కొత్తపల్లె కాలువ తప్పితే దొరసానిపల్లె, ప్రొద్దుటూరు చానెళ్లను ఆనుకొని ఇళ్లను నిర్మించుకున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మురుగు నీరు ఎలా పారుతుందని అన్నారు. వర్షపు నీరు ప్రొద్దుటూరులో నిలుస్తోందంటే ప్రొద్దుటూరు ప్రజలే కారకులన్నారు. 'వీధుల్లో వర్షపు నీరు వెళ్లడం లేదని ఫోన్లు చేస్తున్నారు.. ఎందుకు మాకు ఫోన్లు చేస్తున్నారు..! ప్రొద్దుటూరులో ఉండేది మీరా మేమా 'అని ఎమ్మెల్యే అన్నారు. రోడ్లను ఆక్రమించుకొని నీరు పోలేదంటే ఎలా పోతాయని అన్నారు. జ్ఞానం, బుద్ధి కలిగి మనం బతకాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

విర్రవీగితే కుదరదు..

మన ప్రభుత్వం వచ్చింది.. ఏమైనా చేసుకుందామని విర్రవీగితే కుదరదని ఎమ్మెల్యే అన్నారు. ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్, మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు ఎవరు నిర్వహించినా వదిలి పెట్టొద్దని పోలీసు అధికారులకు సూచించామన్నారు. ఇటీవల పోలీసులు ఎస్‌వీఆర్ఆర్ అనే పేరుగల ఇసుక టిప్పర్లను సీజ్ చేశారన్నారు. ఆ టిప్పర్లు కమలాపురం ప్రాంతానికి చెందిన వ్యక్తులవన్నారు. అయితే ఆ టిప్పర్లు తమవేనని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి ఆరోపణలు చేశారని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మండలంలోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని అమృతానగర్-1, 2, ఖాదర్‌బాద్ ప్రాంతాల్లో శనివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వం ఆగస్టు 31నే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం

బద్వేలు అర్బన్ : ఆడపిల్లల మానప్రాణాలకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు అనంతమ్మ, డీవైఎఫ్ఐ పట్టణ మహిళా కో కన్వీనర్లు నాగలక్ష్మి, ఎస్.కె.ఫాతిమాలు తెలిపారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వాష్‌రూమ్‌లో రహస్య కెమెరాలు పెట్టిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని కోరారు. కళాశాలలో జరిగిన ఘటనపై సీనియర్ ఐపీఎస్ అధికారితో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత చదువుల కోసం ఆడపిల్లలను కళాశాలలకు పంపితే వారి మానప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందనడానికి ఈ ఘటనే మరో నిదర్శనమన్నారు. రాజకీయాలకు అతీతంగా దోషులు ఎంతటి వారైనా వారిని కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో మహిళా సమాఖ్య, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో ఐద్వా మహిళా సంఘం పట్టణ నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా మహిళా సంఘం, డీవైఎఫ్ఐ నాయకురాళ్ళు

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాజుపాళెం : తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తుండటంతో రాజుపాళెం మండలంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలలోనే ఉండాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మట్టి మిద్దెల్లో నివసించే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వర్షాల కారణంగా షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఇలాంటి సమస్యలు ఏవైనా ఉంటే గ్రామ, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాని ఆయన చెప్పారు. కుందూ పరిధిలోని గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుతం వర్షాల కారణంగా కుందూనదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోందని, పిల్లలు, యువకులు, మహిళలు, ప్రజలు అటువైపు వెళ్లకుండా వీఆర్ఏలు, గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

కాశినాయన : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోరుమామిళ్ళ ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీ స్వామినాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తడిసిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని, తడిసిన చేతులతో స్టాటర్లు, మోటార్లను తాకరాదన్నారు.

విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దని, లైన్‌కు తగులుతున్నట్లు చెట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోరాదని, కరెంటుకు సంబంధించిన వస్తువులను తడి చేతులతో ముట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంట్లో ఉన్న వాటర్‌హీటర్ స్విచ్ఛాఫ్ చేసి ప్లగ్ తీసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు టీవీలకు డిష్ కనెక్షన్లు తొలగించుకోవాలని తెలిపారు.